క్లుప్తంగా

జంపనిలో ఉపాధి హామీ గ్రామసభ



జంపని(వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదిక ఆధారంగా గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వేమూరు మండలంలోని జంపని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌పై గ్రామ సభ నిర్వహించడం జరిగిందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 192 ఉపాధి పనులు కూలీల చేత చేయించడం జరిగిందన్నారు. కూలీలకు సక్రమంగా వేతనాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుండూరు పెద మరియమ్మ, పంచాయతీ కార్యదర్శి వివేక, సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత




పేరలి(కర్లపాలెం): విద్యార్థులను దాతలు ప్రోత్సహించటం అభినందనీయమని ఎంపీడీవో నేతాజీ అన్నారు. పేరలి మేకలవారిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, సాల్వేషన్ ఆర్మీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వీరాస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో నేతాజీ చేతుల మీదుగా బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. విద్యార్థులు దాతలు ఇచ్చిన పుస్తకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరాస్వామి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.వందనం, పాస్టర్ ఏసుబాబు, వెంకటేశ్వరమ్మ, ధనుష్, తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులపై అప్రమత్తం కండి



వేమూరు: గ్రామీణ ప్రాంతాల్లో అంటు వ్యాధులు సోకకుండా ఆరోగ్య శాఖ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శేషగిరిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అతిసార వ్యాధి సోకకుండా గ్రామాల్లో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జులై, ఆగస్టు నెలల్లో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లాలని ఆదేశించారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు విధిగా అందజేయాలని చెప్పారు. మండల పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. మండల పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శానిటేషన్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో డయేరియా కేసులు నమోదు కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగికి గుర్తింపు



చుండూరు(భట్టిప్రోలు): ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమని, ఉత్తమ సేవలు అందించేవారు చిరకాలం చెరగని ముద్ర వేసుకుంటారని చినపరిమి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ) మేనేజర్ కోమటి మణికంఠ పవన్ కుమార్ అన్నారు. చుండూరు మండలం చినపరిమి సీజీజీబీ బ్యాంక్‌లో క్యాషియర్‌గా రెండున్నర సంవత్సరాలకు పైగా పని చేస్తూ ఖాతాదారుల అభిమానాన్ని చూరగొన్న చీకటి జనవ పైనీ తెనాలి నాజర్‌పేటకు బదిలీ అయ్యారు. బుధవారం స్థానిక బ్రాంచ్‌లో ఆమెను బీఎం మణికంఠ, సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. వేజండ్ల సమీపంలోని సుద్దపల్లి బ్రాంచ్‌లో పని చేస్తున్న గాజుల హిమజ క్యాషియర్‌గా ఇక్కడకు బదిలీపై వచ్చారు.

మత్తు పదార్థాలతో భవిత నాశనం

రేపల్లె పట్టణ సీఐ నజీర్‌బేగ్



రేపల్లెలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న పట్టణ సీఐ నజీర్‌బేగ్

రేపల్లె రూరల్: మత్తు పదార్థాలు తీసుకోవటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితులు నెలకొంటాయని పట్టణ సీఐ నజీర్‌బేగ్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ వినియోగ వ్యతిరేక దినం సందర్భంగా మత్తు పదార్థాలు, నాటుసారా వంటి వాటిని తీసుకోవటంతో కలిగే దుష్ప్రభావాలపై పట్టణంలోని రింగురోడ్డు సెంటరులో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అయన ప్రారంభించి మాట్లాడారు. ఖైనీ, గుట్కా, నాటుసారా, తంబాకు వంటి పదార్థాలు తీసుకోవటంతో అనేక వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. ప్రమాదకర క్యాన్సర్ మహమ్మారి బారినపడే అవకాశం నూరు శాతం ఉందన్నారు. నిషేధిత పదార్థాలను తీసుకుని వ్యాధుల బారిన పడి కుటుంబాలను రోడ్డుపాలు చేసుకోరాదన్నారు. మన ఆరోగ్యం, మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంటుందని అన్నారు. జీవితాలు పదిలంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలు, నాటుసారా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ మనస్సును కేవలం విద్యపైనే కేంద్రీకృతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

కర్లపాలెం: మాదక ద్రవ్యాలకు బానిసలై బతుకు అంధకారం చేసుకోవద్దని బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు కోరారు. కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో బుధవారం సీఐ హజరత్‌బాబు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన ఆర్థికంగా నష్టపోవటమే కాకుండా అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఇన్‌చార్జ్ ఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



వేమూరులో పోలీసుల ర్యాలీ

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

భట్టిప్రోలు: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు వెళదామని భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశానుసారం స్థానిక టీఎంరావు హైస్కూల్ విద్యార్థులతో ఎస్ఐ, సిబ్బంది, ఉపాధ్యాయులు బుధవారం పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. పరిసర ప్రాంతాలు, విద్యా సంస్థల్లో డ్రగ్స్ వినియోగించే వారిపై టోల్ ఫ్రీ నెంబర్ 14500కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు దారుని సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని పేర్కొన్నారు. 'డ్రగ్స్ భూతాన్ని తరిమి కొడదాం –డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేద్దాం' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, స్టేషన్ రైటర్ నాగరాజు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ



కర్లపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ హజరత్‌బాబు

మత్తు పదార్థాలను పారద్రోలుదాం

వేమూరు: యువకులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వేమూరు సీఐ పసుపులేటి రామకృష్ణ సూచించారు. వేమూరు మండలకేంద్రంలో మత్తు పదార్థాల నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సక్రమంగా చదువులు సాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, రైటర్ ప్రసాద్, ఏఎస్సై దానయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు నాగాంజనేయులు

రేపల్లె రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు కోరారు. కార్మికుల సమస్యలు, పట్టణ పారిశుద్ధ్య పటిష్టతకు తీసుకోవాల్సిన అంశాలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ శేషాద్రితో చర్చించి అనంతరం మాట్లాడారు. రహదారి పక్కనే ఉంటున్న చెత్త నిల్వలను నిత్యం తొలగిస్తుండాలని కోరారు. ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారుల వెంబడి పడవేసే వ్యర్థాలను ఉదయం, సాయంత్రం రెండు పూటలా తొలగించాలన్నారు. ప్రస్తుత వానాకాలంలో మురుగు కాల్వలలో నీటి పారుదల సక్రమంగా ఉండాలంటే సిల్ట్ తొలగింపు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన ప్రదేశాలలో నిత్యం బ్లీచింగ్, సున్నం పిచికారీ చేయటంతో పాటు మురుగు కాల్వలలో ఆయిల్ బాల్స్ వేయించి దోమల ఉధృతి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన కమిషనర్ శేషాద్రి పారిశుద్ధ్యం, కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, బందారు శ్రీనివాసరావు, సిరంశెట్టి శ్రీనివాసరావు, సీహెచ్.శివశంకర్, ఇజ్రాయిల్, దుర్గారావు, సత్యవతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగాంజనేయులు

పట్టుదలతో పోరాడితే విజయం తథ్యం



విద్యార్థులతో సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుధాకర్

- సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట సుధాకర్
- పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన భవిత కేంద్రాల విద్యార్థులకు అభినందన

బాపట్లటౌన్: పట్టుదలతో పోరాడినప్పుడే విజయం సాధించగలరని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త ఎం. వెంకట సుధాకర్ తెలిపారు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో విద్య నభ్యసిస్తూ ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన 25 మంది విద్యార్థులను బుధవారం జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో అభినందించి, జ్ఞాపికలను అందజేశారు. ఏపీసీ వెంకట సుధాకర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించడంతో పాటు వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. ప్రస్తుతం 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులంతా ఇదే స్ఫూర్తితో ఇంటర్ విద్యను పూర్తిచేసి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సమన్వయకర్త జ్యోత్స్న, సమగ్రశిక్ష సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీపై చర్యలు చేపట్టాలి

ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాష్

రేపల్లె రూరల్: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యను అడ్డుపెట్టుకుని అక్రమ వ్యాపారం చేస్తున్న నిర్వాహకులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని భారత విద్యార్థి ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో పుస్తకాలు, యూనిఫాం అధిక ధరలకు విక్రయిస్తుండటంతో తల్లిదండ్రులకు భారంగా మారిందన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై కన్నెత్తి చూడకపోవడంతో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయన్నారు. అమ్మఒడి వచ్చినప్పుడు ఫీజులు కట్టండి.. ముందు అడ్మిషన్ ఫీజు చెల్లించండంటూ రూ.2వేలు నుంచి రూ.5వేల వరకు అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తూ ఆయా పాఠశాలల్లో చేరినా తర్వాత చదవాలంటే తమ దగ్గరే పుస్తకాలు, యూనిఫాం కొనాలని, బయట కొనడానికి వీల్లేదంటూ ఆంక్షలు విధిస్తుండటం తగదన్నారు. టీసీ, సర్టిఫికెట్లు తీసుకొని వేరే పాఠశాలలకు వెళ్లాలంటే ఫీజు మొత్తం కట్టి వెళ్లాలంటూ భయపెడుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే రేపల్లె పట్టణంలోని విద్యాసంస్థల్లో తనిఖీలు చేసి అక్రమ అమ్మకాలు అరికట్టాలన్నారు. అనుమతులు లేని కాలేజీల్లో అడ్మిషన్లు నిలుపుదల చేయాలని, విద్యార్థులు నష్ట పోకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వై.నవీన్, జే.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాష్

ప్రముఖ నటుడు రాజా తాతయ్యకు ఘన సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై జై భవాని నాట్యమండలి పూర్వ అధ్యక్షులు, ప్రముఖ నటులు దివంగత బందారుపల్లి వెంకటేశ్వరరావు(బీవీ రావు) వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వి.రావు కళాసేవా పురస్కార సభ జరిగింది. కార్యక్రమానికి ఎంవీఎల్ నరసింహారావు సభ అధ్యక్షత వహించారు. దేవాలయం అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, శ్రీ జై భవాని నాట్యమండలి అధ్యక్షుడు అయితి వాసుదేవశర్మ, ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షులు పిన్నమనేని పాములయ్య, సీనియర్ నటులు ఏవీ శివయ్య, ఆర్కిటెక్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు. సత్కార గ్రహీతలైన సీనియర్ నటుడు రాజా తాతయ్య(పాలకొల్లు), రంగస్థల నటులు కె.సరిత, ఎస్.మాధవి(హైదరాబాద్)లను బి.వి.రావ్ మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ది అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్ (చిలకలూరిపేట) ఆధ్వర్యంలో షేక్ షఫీ దర్శకత్వంలో ప్రదర్శించిన ఏడనున్నాడో.. ఎక్కడున్నాడో అనే హాస్యనాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.



రాజా తాతయ్యను సత్కరిస్తున్న బీవీఆర్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు

ప్రోత్సాహంతో అద్భుతాలు ఆవిష్కృతం

చిన్నారి నర్తకి గ్రీష్మశ్రీ సత్కార సభలో పాఠశాల విద్య ఆర్‌జేడీ పి.లింగేశ్వరరెడ్డి

తెనాలి: అరవిందుల సందేశాలు ప్రపంచానికి మార్గదర్శకాలని, విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.లింగేశ్వరరెడ్డి అన్నారు. ఆధునిక విద్య ఆధ్యాత్మిక, నైతిక విలువలతో సమ్మిళితంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో పిల్లల్ని ఏ విధంగా తీసుకెళుతున్నామనే అంశంపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని చెబుతూ, విద్యార్థుల్లో సృజనను పెంచటంలో విద్యా సంస్థలు కృషి చేయాలని సూచించారు. పట్టణ నాజరుపేటలోని శ్రీ అరవింద విద్యాకేంద్రం నాలుగో తరగతి విద్యార్థిని, బాలనర్తకి గ్రీష్మశ్రీ మూడు రాష్ట్రాల గవర్నర్ల ప్రశంసలు పొందిన సందర్భంగా బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. శ్రీ అరవింద విద్యాకేంద్రంలో ఏర్పాటైన సభకు సంస్థ డైరెక్టర్ కొండపనేని సంపూర్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రీష్మశ్రీ నృత్యాభినయాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పిల్లలకు క్రమం తప్పని సాధన, ప్రోత్సాహం ఉంటే ఏదైనా సాధిస్తారనేందుకు గ్రీష్మశ్రీ నిదర్శనమన్నారు. ప్రోత్సహించిన తల్లి దండ్రులు, శిక్షణ నిచ్చిన నృత్య గురువుకు అభినందనలు తెలియజేశారు. విశిష్ట అతిథి, సినీదర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ నాట్యంలో చక్కని ప్రతిభను చాటుతున్న గ్రీష్మశ్రీ భవిష్యత్ ఉన్నతం కాగలదని చెప్పారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో తగిన ప్రోత్సాహం ఉంటే ఎదగొచ్చని అభిప్రాయపడ్డారు. అందుకు సహకారం ఉంటుందన్నారు. అధ్యక్షత వహించిన డైరెక్టర్ సంపూర్ణ మాట్లాడుతూ శ్రీ మాతారవిందుల అంతరాత్మ విద్యకు ప్రాధాన్యత నిస్తున్నట్టు చెప్పారు. తెనాలి మండల విద్యాశాఖ అధికారులు డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, జయంత్‌బాబు గ్రీష్మశ్రీని అభినందించారు. తొలుత 'భరత వేదమున' పాటకు గ్రీష్మశ్రీ చక్కని నృత్యాభినయం చేశారు. అనంతరం ఆర్‌జేడీ, దిలీప్‌రాజా, సంపూర్ణ ఆ చిన్నారిని సత్కరించారు. రోటరీ క్లబ్ ప్రతినిధి ఉదర వెంకట పూర్ణచంద్, సినీ నటులు వేమూరి విజయభాస్కర్, మన్నే సత్యనారాయణ, వెంకీ రావణ్‌లు గ్రీష్మశ్రీని అభినందించారు. తొలుత తన నృత్యగురువు నిర్మలారమేష్‌ను సత్కరించారు. గ్రీష్మశ్రీ తల్లిదండ్రులు సెవ్వా కృష్ణారెడ్డి, అరుణకుమారి, విద్యాకేంద్రం కార్యదర్శి యడ్ల మోహన్‌రావు, ఉపాధ్యాయినిలు నందిపాటి శివకుమారి, ఆర్.నిర్మలకుమారి, ఎస్‌వై బాషా, కె.సంధ్య పాల్గొన్నారు.



గ్రీష్మశ్రీని సత్కరిస్తున్న లింగేశ్వరరెడ్డి, దిలీప్‌రాజా, సంపూర్ణ

నైపుణ్యాలతో ప్రతిభావంతులుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలో అంతర్గతంగా దాగిన నైపుణ్యాలను వెలికితీసి ప్రతిభావంతులుగా ఎదగాలని ప్రభుత్వ మహిళా కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బండి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మనస్థానాన్ని ఏర్పరచుకునేందుకు, మన లక్ష్యాలను సాధించేందుకు సహాయపడతాయన్నారు. ఈసందర్భంగా ఓరియెంటల్ హైస్కూల్ విశ్రాంత ప్రిన్సిపాల్ పీవీ నాథ్ జ్ఞాపకార్థం ఆయన పేరుపై స్మారక ప్రోత్సాహక నగదు బహుమతులను ఆయన కుమారుడు, కోడలు రవి, శ్రీలక్ష్మి విద్యార్థులకు అందజేశారు. ఎంబీఏ విభాగం నుంచి పి.అమృతవల్లి, గోపాలదాసు సుమాంజలి, వంగిపురపు యామిని ప్రియ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పర్వతనేని మేఘన చౌదరి, దండా హరనాథ్ వి.శ్రావ్య నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి.కళ్యాణి, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చల్లా వైష్ణవి, ఏ బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంత, అనిత పాల్గొన్నారు.

14వ రోజుకు శాంతి మహాయజ్ఞం

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ బాల స్వామీజీ పర్యవేక్షణలో లోక కల్యాణార్థం విశ్వశాంతి మరియు నవగ్రహ దోష నివారణకు తలపెట్టిన శ్రీ నవగ్రహ సహిత శ్రీ నక్షత్ర సంపూర్ణ శాంతి మహాయజ్ఞం బుధవారం 14వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో భాగంగా బాల స్వామీజీ పర్యవేక్షణలో ఉదయం నుంచి విశేషంగా హోమాలు నిర్వహించారు. ధనిష్ఠ నక్షత్రంలో జన్మించిన వారు పాల్గొని యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం బాల స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ వైభవం ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి సంపూర్ణ జీవిత చరిత్రలో ఉన్న విశేషాలపై బాల స్వామీజీ ప్రవచనం చెప్పారు. శ్రీ వాసవీ మాత ఎప్పుడు జన్మించారు.. అమ్మవారి పూర్వజన్మ వృత్తాంతం ఏమిటి..వంటి విశేషాలను తెలియజేశారు. నేటి నుంచి 30 వరకు ప్రవచన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరరావు, రావూరి సుబ్బారావు, గోవు రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, చుండూరు లోకనాథం, జయలక్ష్మి మాత మండలి సభ్యులు, సాలిగ్రామ మఠం సభ్యులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 29న శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

గిరిజన విద్యార్థులు చదువులో రాణించాలి



నెహ్రూనగర్: సమాజంలో గిరిజన విద్యార్థులు చదువులోని రాణించాల్సిన అవసరం ఎంతైన ఉందని మోక్షిత రుషిక ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మహిళా ప్రాంగణంలోని గిరిజన వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అటవీ ప్రాంతాన్ని వదిలి ఇక్కడికి వచ్చి చదువుకోవడం చాలా హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ శిరీష, హాస్టల్ వార్డెన్ శిల్ప, గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండునాయక్, జిల్లా అధ్యక్షులు అంజినాయక్ పాల్గొన్నారు.

అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలి

లక్ష్మీపురం: అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్ నుంచి పోస్టాఫీసు వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ వ్యవస్థను సైతం ప్రైవేటీకరణకు పూనుకోవడం మోదీ ప్రభుత్వానికి చెల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాన భాగస్వాములు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం రద్దు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మస్తాన్ రావు, ఏసుబాబు, రహ్మాన్, అల్లాబక్షు, ఇమామ్, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, నాయకులు గోలి సాయి, బన్నీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యనందించాలని గుంటూరు తూర్పు ఎంఈఓ–2 నాగేంద్రమ్మ పేర్కొన్నారు. వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. పిల్లలను బడికి పంపని తల్లిదండ్రులను కలిసి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.కోటి 20 లక్షలు మంజూరు చేసిందని అన్నారు. ప్రత్యేకంగా బాలికల విద్యాభివృద్ధికి ఈ ప్రాంతంలో ఉన్నత పాఠశాల అందుబాటులో ఉందని చెప్పారు. కార్యక్రమంలో 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు దయారత్నం, పాఠశాల హెచ్ఎం పి.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం నిత్యపూజలు సుదర్శన, మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం, తిరుప్పావడసేవ, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగా, భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణాలు, ఉంజల్‌సేవ తీర్థ ప్రసాద వితరణతో బ్రహ్మోత్సవాలు ముగియగా, ధనకుదరం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.